
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 16 । నవంబర్ । 2023



సోమశిలలో 29.67 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 29.67 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 39 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,480
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.5,611
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,779
నవర (8 గ్రాములు)	రూ.46,232

గరిష్టం/కనిష్టం
27.9 /25.4

వాతావరణం

గాలిలో తేమ 79 శాతంగా బుధవారం నమోదైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఒకటి నుంచి కార్తీక మాస లక్ష దీపోత్సవం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు (దర్గామిట్ట): కార్తీక మాస లక్ష దీపోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ ఢిల్లీ స్థానిక సలహా మండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నగరంలోని వీఆర్సీ మైదానంలో లక్ష దీపోత్సవాన్ని వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ ఒకటి నుంచి మూడు వరకు నిర్వహించనున్నామని వెల్లడించారు. కార్యక్రమానికి విశేషంగా హాజరుకావాలని కోరారు. కార్యవర్గ సభ్యులు కంజర్ల భాస్కర్‌శర్మ, ఆమంచర్ల వెంకటప్రభాకర్‌రావు, గంధం సునీల్‌కుమార్, ఆశం విజయసారథి, వేద పండితులు గట్టుపల్లి పవన్‌కుమార్‌శర్మ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

19న ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీలో ఆలిండియా వన్డే ఓపెన్ చెస్ పోటీలను రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న నిర్వహించనున్నామని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు రూ.లక్ష నగదు బహుమతితో పాటు 10 స్మార్ట్ వాచ్‌లు, జ్ఞాపికలు, పతకాలు, ప్రశంసపత్రాలను అందజేయనున్నామని వివరించారు. క్రీడాకారులకు ఉచిత భోజన, రవాణా, వసతి సౌకర్యాలను గీతాంజలి కళాశాల యజమాన్యం కల్పిస్తోందని తెలిపారు. వివరాలకు 91456 29999 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు గొలగమూడి విద్యార్థులు



నాగలక్ష్మి



ఇలాక్షి

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి సమీపంలో గల ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ షబీక తెలిపారు. పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు నాగలక్ష్మీ వరప్రసన్న, ఇలాక్షి ఎంపికయ్యారని పేర్కొన్నారు. గుంటూరులోని వెనిగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి అండర్ – 14 సాఫ్ట్‌బాల్ పోటీలను ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించనున్నారని చెప్పారు.

హోరాహోరీగా ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలు



ఆరు వికెట్లు పడగొట్టిన వీపీఎస్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): బుజబుజనెల్లూరులోని సీఏపీ క్రీడామైదానంలో జరుగుతున్న అండర్ – 16 ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. నార్త్, సెంట్రల్ జోన్లు బుధవారం తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన నార్త్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 45 పరుగులకే ఆలౌటైంది. సెంట్రల్ జోన్లోని ఫణీంద్ర ఐదు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులు చేసి ఆలౌటైంది. నార్త్‌జోన్ జట్టులోని వీపీఎస్‌రెడ్డి ఆరు వికెట్లు సాధించారు. పోటీలను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణమోహన్, మంగేష్, ఏసీఏ సెలెక్టర్లు మలిరెడ్డి కోటారెడ్డి, సాగర్, నాగార్జున, ఎన్డీసీఏ మాజీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

రాపూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నెల్లూరు – రైల్వే కోడూరుకు అదనపు సర్వీస్‌ను నడపాలని.. పొదలకూరులో బస్ పాస్ కౌంటర్ ఏర్పాటు.. పెంచలకోన – నెల్లూరుకు సాయంత్రం 4.30 సర్వీస్.. పొదలకూరు నుంచి నెల్లూరుకు ఉదయం ఐదు గంటలకు బస్సులను నడపాలని పలువురు కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని డిపో మేనేజర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు.

దశాబ్దాల కల సాకారం

వెంకటాచలం మండలంలోని మూడు గ్రామాల రైతుల ఏళ్ల కల సాకారమైంది. సీజేఎఫ్ఎస్ భూములు కావడంతో హక్కుల్లేక ఇప్పటి వరకు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన పెడచెవిన పెట్టారు. ఈ క్రమంలో వీరి సమస్యను పరిష్కరించాలనే దృఢ నిశ్చయంతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆయన చొరవతో వీరికి డీకేటీ పట్టాలు మంజూరయ్యాయి. వీటిని అందుకున్న లబ్ధిదారులు ఎంతో సంబరపడి మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

- సీజేఎఫ్ఎస్ భూములకు డీకేటీ పట్టాలు
- పట్టించుకోని గత పాలకులు
- మంత్రి కాకాణి చొరవతో 329 మంది రైతులకు లబ్ధి



రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మండలంలోని గుడ్లూరువారిపాళెం, పుంజులూరుపాడు, ఎగువమిట్ట గ్రామాల రైతులు ఖుషీఖుషీగా ఉన్నారు. వాస్తవానికి ఈ గ్రామాల మధ్యలో 326 ఎకరాల విస్తీర్ణంలో కామినేని చెరువు ఉంది. దాదాపు 40 ఏళ్లుగా ఈ చెరువు భూములను ఈ గ్రామాల రైతులు సాగు చేసుకుంటున్నారు. అప్పట్లో చెరువు భూములను సీజేఎఫ్ఎస్ భూములుగా మార్చారు. ఈ భూములకు ఆర్డీఓ పేరుతో పట్టాదారుడు.. అనుభవదారులుగా సంబంధిత రైతుల పేర్లను నమోదు చేశారు. అయితే సీజేఎఫ్ఎస్ భూములకు ప్రభుత్వ పథకాలు, ఇతర ఏ ప్రయోజనాలు చేకూరే అవకాశం లేకపోవడంతో అప్పటి నుంచి ఈ గ్రామాల రైతులు పాలకులు, అధికారుల చుట్టూ తిరిగారు.

కాళ్లరిగేలా తిరిగినా కానరాని ప్రయోజనం

గత ప్రభుత్వ హయాంలో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరిగారు. సీజేఎఫ్ఎస్‌ను రద్దు చేయించి ప్రభుత్వ భూములుగా మార్చి వదిలేశారు. ఈ విషయమై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవడంతో గుడ్లూరువారిపాళెం పంచాయతీ మొలకలపూడి వద్ద సభను నిర్వహించి డీకేటీ పట్టాలను ఇవ్వడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ఆ సమయంలో సోమిరెడ్డితో రైతులు వాగ్వాదానికి దిగగా, తప్పించుకొని వెళ్లిన ఉదంతాలూ ఉన్నాయి.

ప్రతిష్టాత్మకంగా.. పట్టువదలకుండా

గుడ్లూరువారిపాళెం, పుంజులూరుపాడు, ఎగువమిట్ట గ్రామాల సీజేఎఫ్ఎస్ భూములకు డీకేటీ పట్టాల మంజూరు అంశాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక భూముల విషయాన్ని కలెక్టర్‌తో చర్చించారు. ప్రభుత్వ భూములుగా ఉన్న వీటిని ఎవరైతే సాగు చేసుకుంటున్నారో సంబంధిత రైతుల పేర్లను అనుభవదారులుగా చేర్పించారు. దీంతో వీరికి రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.7500 రైతు భరోసా లబ్ధి చేకూరింది.

సఫలీకృతం

డీకేటీ పట్టాలను పంపిణీ చేస్తే కేంద్ర ప్రభుత్వమిచ్చే రూ.ఆరు వేలు సైతం వస్తుందని.. తద్వారా శాశ్వత భూహక్కు కల్పించినట్లు అవుతుందని తెలుసుకొని ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మంత్రి తీసుకెళ్లారు. సమస్యపై రాష్ట్రస్థాయి అధికారులతో పలుమార్లు మాట్లాడి మూడు గ్రామాల రైతులు 329 మందికి 326 ఎకరాల డీకేటీ పట్టాలను పంపిణీ చేశారు. మొలకలపూడిలో ఎక్కడైతే సభను సోమిరెడ్డి నిర్వహించి ఆ భూములకు పట్టాలివ్వలేమని చెప్పారో, అక్కడే కార్యక్రమాన్ని నిర్వహించి పట్టాలను మంత్రి అందజేశారు. కాగా ఈ విషయమై సాక్షితో మంత్రి కాకాణి మాట్లాడారు. ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ డీకేటీ పట్టాలను పంపిణీ చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని చెప్పారు. రెండుసార్లు తనను గెలిపించిన సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడాన్ని తన బాధ్యతగా భావిస్తానని చెప్పారు.

జీవితాంతం రుణపడి ఉంటాం



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. దీని ద్వారా మా కుటుంబాలకు ఎన్నో ప్రయోజనాలు కలగనున్నాయి.

– వెడిచర్ల మనెయ్య, పుంజులూరుపాడు

పట్టాల పంపిణీతో భరోసా



సీజేఎఫ్ఎస్ భూములకు డీకేటీ పట్టాలను పంపిణీ చేయడంతో మాకు ఆర్థిక భరోసా లభించింది. గత టీడీపీ ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోలేదు. సీజేఎఫ్ఎస్‌ను రద్దు చేసి వదిలేశారు. ప్రస్తుతం మంత్రి కాకాణి ప్రత్యేక చొరవ చూపి పట్టాలను పంపిణీ చేశారు.

– కరుణాకర్, పుంజులూరుపాడు

త్వరితగతిన రిహాబిలిటేషన్ కేంద్ర నిర్మాణం



భవన నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నెల్లూరు సిటీ: పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారుల సంరక్షణ కోసం ఏర్పాటు చేస్తున్న న్యూట్రిషనల్ రిహాబిలిటేషన్ సెంటర్ భవన నిర్మాణాన్ని అన్ని మౌలిక వసతులతో త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో నేత్ర విభాగ భవనాన్ని ఆధునికీకరించి ఎన్నార్సీ కేంద్రంగా అందుబాటులోకి తీసుకొస్తున్న నేపథ్యంలో పనులను వైద్యాధికారులతో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బరువు తక్కువగా ఉన్న ఆర్నెల్ల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు.. పౌష్టికాహార లోపంతో ఉన్న పిల్లల సంరక్షణ కోసం ఎన్నార్సీ కేంద్రాన్ని రూ.30 లక్షలతో నిర్మిస్తున్నామని వెల్లడించారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో రూ.23 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి సంబంధించిన ప్లాన్‌ను పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, హాస్పిటల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌నాయుడు, ఏపీఎమ్మెస్ఐడీసీ ఈఈ సుధాకర్, డీఈ సాంబశివరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు, అభ్యంతరాలను డిసెంబర్ 26 నాటికి పరిష్కరించనున్నామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్లోని తన చాంబర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యంతరాలను పారదర్శకంగా పరిశీలించి స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి కృషి చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 2, 3వ తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్‌ను నిర్వహించి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనున్నామని వివరించారు. జిల్లాలో ఈవీఎంల తొలి దశ తనిఖీ ప్రక్రియను సజావుగా పూర్తి చేశామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బూత్ లెవల్ ఏజెంట్లను పూర్తిస్థాయిలో నియమించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. డీఆర్వో లవన్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటశేషయ్య, టీడీపీ నేత భువనేశ్వరిప్రసాద్, బీజేపీ నేత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై నేటి నుంచి శిక్షణ

కులగణనపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన స్టేక్ హోల్డర్లకు శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో గురువారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని చెప్పారు.

- సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, ఇతర ఉన్నత స్థాయి అధికారులతో పాటు ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలకు అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2.30కు నిర్వహించనున్నామని పేర్కొన్నారు.
- కందుకూరు, కావలి ఆర్డీఓ కార్యాలయాల్లో ఈ నెల 17న, ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో 18న శిక్షణను నిర్వహించనున్నామన్నారు.
- నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అధికారులకు జెడ్పీ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమాన్ని 18న నిర్వహించనున్నామని వివరించారు.
- జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఈ నెల 20 నుంచి 22 వరకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందన



వెంకటాచలం: వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌లో పాల్గొన్న వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లను కాకుటూరులోని వర్సిటీలో వైస్ చాన్సలర్ సుందరవల్లి బుధవారం అభినందించారు. విజయవాడ సమీపంలోని కేఎల్ యూనివర్సిటీలో ఈ నెల ఒకటి నుంచి పదో తేదీ వరకు నిర్వహించిన వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌నకు వీఎస్‌యూ నుంచి ముగ్గురు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హాజరై అనేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా పాల్గొనాలని వీసీ కాంక్షించారు.

సుధీర్ నేరసామ్రాజ్యంపై లోతుగా విచారణ

- త్వరలో పోలీస్ కస్టడీకి

నెల్లూరు(క్రైమ్): దేవరకొండ సుధీర్ నేర సామ్రాజ్యాన్ని కూకటి వేళ్లతో పెకిలించేందుకు ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పర్యవేక్షణలో పోలీసులు అన్ని కోణాల్లో లోతుగా విచారణ జరుపుతున్నారు. జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న సుధీర్ ప్రధాన అనుచరుడు శివకుమార్‌రెడ్డిని పోలీస్ కస్టడీకి తీసుకొని విచారిస్తున్నారు. మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకే బంగారం ఇస్తామని.. పొలాలు అమ్ముతామని.. నోట్ల మార్పిడి.. నకిలీ పోలీసుల ముసుగులో మోసాలు, నేరాలకు సంబంధించిన పలు కీలక సమాచారాన్ని రాబట్టి దాని ఆధారంగా విచారణ జరుపుతున్నారని తెలిసింది. సుధీర్ ఫోన్ కాల్ లిస్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆయనకు ఎవరెవరితో దగ్గరి సంబంధాలున్నాయి.. మోసాలతో వారికేమైనా ప్రమేయం ఉందాననే కోణాల్లో లోతుగా విచారణ జరుపుతున్నారని సమాచారం. మరోవైపు జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న సుధీర్‌ను పోలీస్ కస్టడీకి ఇవ్వాలంటూ ఇప్పటికే న్యాయస్థానాన్ని అధికారులు కోరారని తెలిసింది. అనుమతి రాగానే పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకొని క్షేత్రస్థాయిలో విచారణ జరపనున్నారు. సుధీర్ గ్యాంగ్ అరెస్ట్ అనంతరం వారి మోసాలపై తెలంగాణ, ఏపీకి చెందిన పలువురు స్పందనలో ఫిర్యాదు చేయగా, వీటిపై సైతం విచారణ సాగుతోంది.

వీఆర్‌కు దిశ డీఎస్పీ

నెల్లూరు(క్రైమ్): దిశ డీఎస్పీ సురేష్‌బాబును వీఆర్‌కు బదిలీ చేస్తూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు డీటీసీ డీఎస్పీ శిరీషకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.

జాయింట్ అకౌంట్ తప్పనిసరి



మాట్లాడుతున్న రమేష్

నెల్లూరు (వేదాయపాళెం): జగనన్న విద్యా, వసతి దీవెన ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులైన విద్యార్థులు బ్యాంక్ అకౌంట్‌ను కలిగి ఉండాలని జిల్లా సాంఘిక, సంక్షేమ శాఖ అధికారి రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడారు. ఇక నుంచి ఈ పథకాల ద్వారా నగదును విద్యార్థి, వారి తల్లుల జాయింట్ ఖాతాలో ప్రభుత్వం జమచేయనుందని చెప్పారు. ఈ మేరకు బ్యాంక్ ఖాతాను తెరవాలని సూచించారు. 2022 – 23 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫైనలియర్ విద్యార్థులు, ఎస్సీ విద్యార్థులకు మినహాయింపు ఉంటుందన్నారు. కొత్త ఖాతాల ప్రారంభానికి గానూ బ్యాంకులకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మొదటి అకౌంట్ హోల్డర్‌గా విద్యార్థి, తదుపరి రెండో హోల్డర్‌గా విద్యార్థి తల్లి ఉంటుందన్నారు. తల్లి మరణించి ఉంటే తండ్రితో జాయింట్ అకౌంట్ చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రుల్లేకపోతే గార్డియన్‌తో చేసుకోవాలని సూచించారు. దీని కోసం విద్యార్థి, తల్లికి సంబంధించిన మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఇద్దరి ఆధార్ కార్డు కాపీలను బ్యాంక్‌కు సమర్పించాలని సూచించారు. ఆధార్ కార్డులో పుట్టిన తేదీ సక్రమంగా లేకపోతే స్టడీ సర్టిఫికెట్‌ను సమర్పించాలని కోరారు. కాలేజ్ ఐడీ కార్డును పొందుపర్చాలని, బ్యాంక్ ఖాతాను ప్రారంభించిన అనంతరం కాపీని సచివాలయంలో ఇచ్చి పోర్టల్లో వివరాలను అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. ప్రక్రియను ఈ నెల 24లోపు పూర్తి చేయాలని సూచించారు.

తల్లిని కడతేర్చిన తనయుడు

- రోకలి బండతో కొట్టి హత్య



ప్రసాద్



అంకమ్మ మృతదేహం

పొదలకూరు: రోకలి బండతో కొట్టి తల్లిని తనయుడు కడతేర్చిన ఘటన అంకుపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మాముడూరు అంకమ్మ (75)కు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. ఈమె చిన్న కుమారుడు ప్రసాద్ మద్యానికి బానిసవ్వడంతో భార్య, ఇద్దరు పిల్లలు అతడికి దూరంగా నెల్లూరులో జీవిస్తున్నారు. ప్రస్తుతం ప్రసాద్‌తో తల్లి ఉంటున్నారు. కొంతకాలంగా వయస్సు కారణంగా అనారోగ్యంతో ఆమె మంచం పట్టారు. ఈ క్రమంలో ఆమెకు సేవలు చేయలేక.. మద్యం మత్తులో ఉన్న ప్రసాద్ ఇంట్లో ఉన్న రోకలిబండతో తలపై కొట్టి హత్య చేశారు. అనంతరం మరోసారి మద్యం తాగి బంధువుల ఇంటికెళ్లి తన తల్లిని రోకలిబండతో కొట్టానని చెప్పారు. దీంతో గ్రామానికి చెందిన వారు డయల్ 100కు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి పోలీసులు వెళ్లగా, మద్యం మత్తులో నిందితుడు నిద్రిస్తూ కనిపించారు. దీంతో నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. కావలిలో ఉన్న పెద్ద కుమారుడు గ్రామానికి చేరుకున్నారు. ఘటన జరిగిన గ్రామం కండలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండటంతో రాపూరు సీఐ సుబ్రహ్మణ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేగూరు నుంచి అంతర్జాతీయ పోటీలకు..

- మాస్కోలో రెజ్లింగ్ పోటీలకు జిల్లా వాసి
- తల్లి, కోచ్‌ల ప్రోత్సాహంతో రాణింపు



హరియాణాలో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచిన నరేంద్ర (ఫైల్)

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాకు చెందిన యువకుడు రెజ్లింగ్ గ్రాప్లింగ్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగి పలువురి ప్రశంసలను అందుకుంటున్నారు. కష్టాలు అనుభవించి.. అనేక ఆటుపోట్లను ఎదుర్కొని ఈ ఘనత సాధించిన కోవూరు మండలం వేగూరుకు చెందిన మోచర్ల నరేంద్ర శభాష్ అనిపించుకుంటున్నారు. రష్యాలోని మాస్కోలో ఈ నెల 17 నుంచి 20 వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా పేరును ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని క్రీడాభిమానులు కాంక్షిస్తున్నారు.

చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి

నరేంద్ర తండ్రి వెంకట రమణయ్య వంట మాస్టారుగా పనిచేయడంతో పాటు ఖాళీ సమయాల్లో వ్యవసాయ కూలీ పనులకెళ్లేవారు. అతికష్టంపై కుటుంబాన్ని పోషించి నరేంద్రను చదివించేవారు. రెండేళ్ల క్రితం అనారోగ్యంతో ఆయన మరణించారు. అప్పటి నుంచి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని తల్లి పెంచలమ్మ నెట్టుకొస్తున్నారు.



రెజ్లింగ్ సాధన చేయిస్తూ..

అంచలంచెలుగా..

నరేంద్ర తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. విద్యనభ్యసిస్తూనే రెజ్లింగ్‌లో అంచలంచెలుగా ఎదిగారు. జాతీయ స్థాయి పోటీల్లో మూడుసార్లు పాల్గొని అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించలేకపోయారు. తాజాగా అంతర్జాతీయ వేదికపై తన సత్తా చాటే అవకాశాన్ని దక్కించుకున్నారు.

విశేష శిక్షణ

క్రీడలకు అవసరమయ్యే పరికరాలు, టోర్నీకి వెళ్లేందుకు డబ్బుల్లేకపోవడం అతడ్ని మానసికంగా కుంగదీసింది. ఈ క్రమంలో రెజ్లింగ్ కోచ్ ప్రేమ్‌కుమార్ దృష్టి నరేంద్రపై పడింది. తానే శిక్షణ ఇస్తూ.. అవసరాలను తీరుస్తూ.. అంతర్జాతీయ వేదికపై నిలబెట్టేందుకు ఎంతో కృషి చేశారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, పెన్నా ఒడ్డున శిక్షణ ఇచ్చేవారు. దేహదారుఢ్యం కోసం స్లిమ్ లైఫ్ జిమ్ పూర్తిగా ఉచిత శిక్షణ సౌకర్యాన్ని కల్పించింది.


సాధించిన పతకాలు

- 2018 – 19లో జిల్లా స్థాయి రెజ్లింగ్ గ్రాప్లింగ్ పోటీల్లో ప్రస్థానాన్ని ప్రారంభించారు.
- 2021లో అనంతపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకాన్ని సాధించారు. అనంతరం ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఫైనల్స్‌కు చేరుకున్నారు.
- తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణ పతకాన్ని సాధించారు. అనంతరం నాసిక్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఫైనల్స్ వరకు వెళ్లారు.
- ఆలిండియా ఇంటర్ వర్సిటీ స్పోర్ట్స్ మీట్‌లో కాంస్య పతకాన్ని సాధించారు.
- విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి.. హరియాణాలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో స్వర్ణ పతకాలను సాధించారు.
- నేషనల్ సీనియర్స్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌ను అందుకున్నారు. ఈ పోటీల్లో ఢిల్లీకి చెందిన క్రీడాకారుడిపై విజయం సాధించారు.

వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులు

వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటేందుకు అవకాశం లభించినా, నరేంద్రను ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వమిచ్చే నిధులతో పాటు రూ.రెండు లక్షల మేరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. ఆర్థిక సాయం చేయాలనుకునే వారు 82971 86051 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.

లక్ష్యం సాధిస్తా



చిన్నప్పటి నుంచి తల్లి కష్టంతో క్రీడల్లో రాణించా. కోచ్ ప్రేమ్‌కుమార్.. ఎంతో మంది ప్రోత్సాహంతో ఈ స్థాయికి ఎదిగా. పరిస్థితులను అధిగమించి అంతర్జాతీయ పోటీలకు హాజరవుతున్నా. విజయం సాధించి మంచి పేరు దక్కించుకుంటా.

– నరేంద్ర, అంతర్జాతీయ రెజ్లింగ్ క్రీడాకారుడు

సీఎం దృష్టికి 'కామధేను' అవకతవకలు


మాట్లాడుతున్న విజయకుమార్

కోవూరు : జిల్లాలోని కొండాపురం మండలంలో ఉన్న చింతలదేవి కామధేను ప్రాజెక్టులో జరుగుతున్న అవకతవకలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ జిల్లా చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ అన్నారు. కోవూరులోని కొత్తూరులో ఉన్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్కడ పశువులకు సరైన మేత లేదని, ఎరువులు కూడా ఇష్టప్రకారం అమ్మేస్తున్నారని డైరెక్టర్లు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. అక్కడ రాత్రి వేళల్లో రూ.3 లక్షలకు పైగా విలువ చేసే ఎరువును ఎటువంటి అనుమతులు లేకుండా అమ్మకాలు చేశారని తన దృష్టికి వచ్చిందన్నారు. అదేవిధంగా రాత్రి వేళల్లో గేదెలు, పొట్టేళ్లు కూడా తరలిస్తున్నారన్నారు. దీనిని ఏపీఎల్డీఏ సీఈఓ దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత అధికారులకు మెమోలు జారీ చేశారన్నారు. ఇటీవల బీజేపీ నేతలు చింతలదేవిలో జరుగుతున్న అక్రమాలపై తమకు వినతిపత్రం అందజేశారన్నారు. దీనిని కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక కమిటీ వేసి వాస్తవాలు బయటకొచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో 26 జిల్లాల్లో పశువుల సార్టెడ్ సెమన్ విక్రయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ మహేశ్వరుడు, సీఈఓ డాక్టర్ సోమయ్య, ఎండీ డాక్టర్ కృష్ణమోహన్ ఉన్నారు.

ఓట్లడిగే అర్హత టీడీపీకి లేదు

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ప్రజలను ఓట్లడిగే అర్హత టీడీపీకి లేదని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల గ్రామంలో ఆయన బుధవారం మాట్లాడారు. జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణం నుంచే జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలో ఉండగా సంక్షేమ పథకాల అమలుకు జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని వెల్లడించారు. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటకు చేరుతున్నాయని తెలియజేశారు. ఈ వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా కిలోమీటర్ల దూరం ఉండే ఎమ్మార్వో, ఎంపీడీఓ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలో సచివాలయం ఏర్పాటై విస్తృత సేవలు అందిస్తున్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ నాలుగున్నరేళ్లు ఎక్కడికెళ్లారో తెలియని టీడీపీ నేతలు ఎన్నికల సమయంలో మారువేషాలు వేసుకుని ప్రజలపై కపట ప్రేమ చూపిస్తారన్నారు. టీడీపీ వాళ్ల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రిగా ఉండడం చారిత్రక అవసరమని తెలియజేశారు.

సంక్షేమ పథకాలతోనే పేదరిక నిర్మూలన

• ఎంపీ బీద మస్తాన్‌రావు


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన సాధ్యమని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. పట్టణంలోని పదో వార్డు పరిధిలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల రూపంలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో భాగంగా విద్య, వైద్య, సంక్షేమ రంగాలకు భారీగా నిధులు వెచ్చించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళా సాధికారత దిశగా వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా ఆయా కుటుంబాలను కూడా అభివృద్ధి చేయవచ్చనే ఉద్దేశంతో మహిళా సంక్షేమానికి కూడా పెద్దపీట వేసినట్లు తెలిపారు. పాలనలో పారదర్శకతతో పాటు ప్రజల వద్దకే పథకాలు తీసుకెళ్లడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని వివరించారు. గడిచిన 54 నెలల కాలంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనుమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య, కుందుర్తి సునీత తదితరులు పాల్గొన్నారు.

నారాయణ వ్యాఖ్యలు హాస్యాస్పదం

• సిటీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్‌కుమార్


47వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరు నగర ప్రజలు సీరాజనాలు పడుతున్నారంటూ టీడీపీ నేత నారాయణ చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ అన్నారు. నగరంలోని 47వ డివిజన్‌లో కుక్కలగుంట మహాలక్ష్మమ్మ గుడి సెంటర్, మిట్ట, సవరాల వీధి, ములుముడి బస్టాండ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆయన బుధవారం పర్యటించారు. అనంతరం స్థానిక డివిజన్‌లో రూ.కోటి నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో సంతృప్తికరంగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. నగర నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయిన్లు, స్కూల్స్, హాస్పిటల్స్ తదితర అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధమా అని నారాయణకు సవాల్ విసిరితే ఇప్పటి వరకు రాలేదన్నారు. కనీసం డివిజన్‌లో పర్యటిస్తున్నప్పుడు టీడీపీ కార్యకర్తలను పట్టించుకోకుండా పెయిడ్ బ్యాచ్‌ను పెట్టుకుని తిరుగుతున్నట్లు తెలిపారు. ఎన్నికలు పూర్తయితే ఆ పెయిడ్ బ్యాచ్‌కు కూడా నారాయణ కనిపించరన్నారు. ఆయన నెల్లూరులోని ప్రజలను పట్టించుకోకుండా హైదరాబాద్‌లో ఏమి చేస్తారో అర్థం కావడం లేదన్నారు. ఎప్పుడూ సేవ చేశానని నారాయణ చెబుతుంటారని, కానీ ఆయన హాస్పిటల్లో, విద్యాసంస్థల్లో ఎంత మందికి ఉచితంగా విద్య, వైద్యం అందించారో చెప్పాలని నిలదీశారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి వ్యవసాయ సమీక్ష

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


గడప గడపకు మన ప్రభుత్వంలో సంక్షేమ లబ్ధి కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: ఆత్మకూరు నియోజకవర్గ రైతాంగం ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, భవిష్యత్ లో ఇలాంటి సమస్య ఎదురు కాకుండా వ్యవసాయ రంగంలో నిష్ణాతులైన వారి తో డిసెంబర్ 9న వ్యవసాయ సమీక్ష నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం భీమవరం సచివాలయం పరిధిలోని పొంగూరుకండ్రికలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని వెంకయ్యస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రతి గడపకు వెళ్లిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను అధికారులకు తెలిపి సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌తో పలుమార్లు సమీక్షలు నిర్వహించామని, ఇప్పటి వరకు 30 వేల నోషనల్ ఖాతాలు, 8 వేల ఎకరాల సాదాబైనామా కేసులు, 23 వేల ఎకరాల చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి నిరంతరాయంగా పనులు చేస్తున్నారన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రామాల్లో సీసీరోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, సర్పంచ్‌లు తిరుపాల్‌నాయుడు, మాగుంటి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ కోనంకి శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

సమగ్ర నివేదిక అందజేయండి

నెల్లూరు(క్రైమ్) : యువకుడి ఆత్మహత్య కేసులో సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని జాతీయ మానవహక్కుల కమిషన్ జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డిని కోరింది. వివరాల్లోకి వెళ్తే.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన వినయ్ ఆత్మకూరులోని ఆర్టీసీ డిపో సమీపంలో ఓ బైక్ మెకానిక్ వద్ద సహాయకునిగా పనిచేస్తున్నారు. అక్కడ కొందరు వినయ్‌పై దాడిచేశారు. దీంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. అతని ఆత్మహత్యకు దాడి చేసిన వారు, పోలీసుల నిర్లక్ష్యమూ కారణమని బాధిత కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు అందడంతో విచారణ జరిపి నివేదికను అందజేయాలని జిల్లా ఎస్పీని కోరింది.

దేశవ్యాప్త కులగణన చేపట్టాలి

• బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘ నేతలు

కందుకూరు : చట్టసభల్లో ఓబీసీ వర్గాలకు సరైన న్యాయం దక్కాలంటే దేశ వ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్‌చేశారు. కందుకూరులోని ఆదిత్య ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ వంటి చట్టసభల్లో బీసీ జనాభా ప్రకారం వారికి సీట్లు దక్కడం లేదన్నారు. ఇటీవల పార్లమెంట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టంలో ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా లేకపోవడం వల్ల మరోసారి ఓబీసీ మహిళలకు అన్యాయం జరుగుతుందన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టంలో ఓబీసీలకు ప్రత్యేక కోటా ఉండేలా చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు.

27న కందుకూరులో రాష్ట్రస్థాయి సదస్సు

బడుగు, బలహీన వర్గాల్లో ఐక్యత కోసం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న రాష్ట్ర స్థాయి సదస్సును కందుకూరులోని వెంగమాంబ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సోమరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర సమన్వయకర్త బ్రహ్మానంద శర్మ, రాష్ట్ర యువజన అధ్యక్షుడు క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుబ్బాయమ్మ, బీసీ నేతలు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి రూ.లక్ష ఆర్థిక సాయం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని వెంకట హర్షిణి ఇటీవల తెనాలిలో జరిగిన జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబర్‌లో థాయ్‌లాండ్‌లో జరిగే పోటీలో పాల్గొనే నిమిత్తం క్రీడాకారిణికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. ఈ నగదును జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి బుధవారం అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు విజయ్‌రెడ్డి, సర్పంచ్ ఎస్.సుజన, వైఎస్సార్‌సీపీ నేత రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రైలు- ప్లాట్‌ఫారమ్ మధ్య నలిగిన ప్రాణం

నెల్లూరు(క్రైమ్) : ప్రమాదవశాత్తు రైలు-ప్లాట్‌ఫారమ్ మధ్య నలిగి మహిళ మృతిచెందిన ఘటన బుధవారం తెల్లవారుజామున నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా రామగుండానికి చెందిన జరీన్‌సల్మా(43) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబసభ్యులతో కలిసి ఆమె ఇటీవల ఏఎస్‌పేట దర్గాకు వచ్చారు. అక్కడ పూజలు చేసి మంగళవారం రాత్రి స్వగ్రామానికి వెళ్లేందుకు నెల్లూరు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. బుధవారం తెల్లవారుజామున ఆమె మూత్రవిసర్జనకు మూడో నంబర్ ప్లాట్‌ఫారమ్ దిగి రైలు పట్టాల వద్దకు వెళ్లింది. మూత్రవిసర్జన చేసి తిరిగి వస్తుండగా అకస్మాత్తుగా రైలు రావడంతో ప్లాట్‌ఫారమ్ మధ్యలో చిక్కుకుని సల్మా మృతిచెందింది. కుటుంబసభ్యులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్లాట్‌ఫారమ్ చివరన పగులగొట్టి మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్) : రైలు పట్టాలు దాటుతుండగా గూడూరు-విజయవాడ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన వేదాయపాళెం-నెల్లూరు రైల్వేస్టేషన్‌ల మధ్య నెల్లూరు వైపు పట్టాలపై బుధవారం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 60 నుంచి 65 ఏళ్లలోపు వయస్సు కలిగి గోధుమ రంగు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, బ్రౌన్ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

బొగ్గు లోడు లారీ దగ్ధం


రోడ్డుపై దగ్ధమవుతున్న లారీ

వరికుంటపాడు : బొగ్గు లోడుతో వెళ్తున్న లారీలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన ఘటన బుధవారం వరికుంటపాడు మండలంలోని జడదేవి పిల్లాపేరు వాగు సమీపంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. దుత్తలూరు సమీపంలో కటారి వెంకటేశ్వర్లుకు చెందిన బొగ్గు బట్టీల నుంచి ఓ లారీ బొగ్గులోడుతో ఏలూరుకు బయలుదేరింది. పిల్లాపేరు వాగు సమీపంలోకి వచ్చేసరికి లారీ నుంచి పొగలు రావడంతో వెనుక వస్తున్న వాహనదారులు గమనించి లారీ డ్రైవర్‌కు తెలిపారు. వెంటనే డ్రైవర్ తిరుపతిరెడ్డి లారీని రోడ్డు పక్కన ఆపి చూడగా మంటలు ఎగసి పడుతున్నాయి. వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. ఉదయగిరి సీఐ వి.గిరిబాబు, ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డితో పాటు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరితో పాటు ఉదయగిరి, వింజమూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో లారీ పూర్తిగా దగ్ధమైంది. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)
పెద్దవి : రూ.40
సన్నవి : రూ.15
పండ్లు : రూ.6

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.102
లేయర్	రూ.105
బ్రాయిలర్ చికెన్:	రూ.186
స్కిన్‌లెస్ చికెన్:	రూ.206
లేయర్ చికెన్:	రూ.178

